కాంగ్రెస్ గెలుపు ఖాయం

ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్ కుమార్ యాదవ్



ఎస్‌బిఐ కాలనీలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్



కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు దాదాపు ఖరారు అయినట్లేనని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు 2, 3వ స్థానాలకు పోటీ పడుతున్నాయని ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం. అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కవాడిగూడ డివిజన్ పరిధిలోని ఎస్‌బిఐ కాలనీ, ఎల్బిగూడ, అడ్వొకేట్స్ కాలనీ, ఎస్‌బి కాలనీ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పు కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అరవింద్ కుమార్ యాదవ్, కృష్ణ, అంజిరెడ్డి, పోతరాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్‌కు మద్దతుగా ప్రచారం

చిక్కడపల్లి: ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించాలని ఆ పార్టీ యూత్ నేత సాయికీర్త్(బాబ్జీ) అన్నారు. అంజన్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.



జవహర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న సాయి సంకీర్త్

బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్



బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్‌కు గుమ్మడి కాయతో దిష్టి తీస్తున్న దృశ్యం

నల్లకుంట: బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని అంబర్‌పేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. ప్రజల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. తాను నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి వారికి ఓటేస్తే ప్రజలను నట్టేట ముంచుతారన్నారు. సోమవారం ఆయన నల్లకుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నానగర్, సత్యానగర్‌లలో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. స్థానికులు కాలేరుకు గుమ్మడి కాయతో దిష్టితీశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వనం ర మేష్, డివిజన్ నాయకులు ఎం.భూపతినాద్, మేడి ప్రసాద్, ప్రవీణ్, భాస్కర్ గౌడ్, భాస్కర్, గాలపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

ముషీరాబాద్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలసాని సాయికిరణ్‌యాదవ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ ఎంసీహెచ్ కాలనీలో గ్రేటర్ సీనియర్ నాయకుడు టి.సోమన్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన 50 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి తలసాని సాయికిరణ్‌యాదవ్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, టి.సోమన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం తలసాని సాయికిరణ్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేస్తే తెలంగాణలో అభివృద్ధి ఆగిపోతుందన్నారు. ముషీరాబాద్‌లో మరింత అభివృద్ధి సాధించాలంటే రెండో సారి ముఠా గోపాల్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌ప్రసాద్, ఆకుల అరుణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, గౌరీశంకర్ ఆలయ కమిటి చైర్మన్ శ్రీధర్‌చారి, మహిళా కమిటి అధ్యక్ష, కార్యదర్శులు శోభ, శ్రావంతి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం

మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్‌లో బిరన్ మర్చంట్ అసోసియేషన్ బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చింది. ముఠా గోపాల్ మాట్లాడుతూ భోలక్‌పూర్‌లో డ్రైనేజీ, మంచినీటి, రోడ్లను ఆధునీకరించామని తెలిపారు. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వై.శ్రీనివాస్‌రావు, రహీం, ఫారూఖ్‌బాయ్, షరీఫ్‌ఉద్దీన్, హుస్సేన్, ఆర్.శ్రీనివాస్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్ బస్తీలో సోమవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో పలువురు కాంగ్రెస్, బీజేపీకి చెందిన కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్‌లో తాను చేసిన అభివృద్ధే మరోసారి గెలిపిస్తుందన్నారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, మోజెస్, దామోదర్‌రెడ్డి, వెంకటకృష్ణారావు(బబ్లూ), కిషన్‌రావు, పి.రాజేంద్రప్రసాద్‌గౌడ్, వి.నాగభూషణం, రాజు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పిన తలసాని సాయికిరణ్‌యాదవ్

కారు..టాప్ గేర్

కేటీఆర్ రోడ్ షోతో గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం



కేటీఆర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: ముషీరాబాద్‌ను టార్గెట్ చేసుకుని ప్రధాని మోదీ, నడ్డా ఒక వైపు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీకే శివకుమార్, ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ తదితరులు మరోపక్క ప్రచారాలు నిర్వహిస్తున్న క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు మా కోసం ఎవరు వస్తారా అని ఎదురు చూస్తున్న క్రమంలో మంత్రి కేటీఆర్ హాజరై గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. తూటాల్లాంటి మాటలతో ప్రత్యర్థి పార్టీలను రఫ్ఫాడించారు. లక్ష్మణ్, కిషన్‌రెడ్డిలను మొదలు, అంజన్‌కుమార్ యాదవ్‌లపై సెటర్లు వేస్తూ వారి కంటే తామే ఎక్కువ అనే భావాన్ని కార్యకర్తల్లో కలిగించారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సినిమా థియేటర్ల పేర్లన్నీ చెప్పి చిన్నప్పుడు ఇందులోనే సినిమాలు చూసి తరించానని అటువంటి ముషీరాబాద్ ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెందిందంటూ ఒక వైపు అభివృద్ధిని, మరో వైపు సంక్షేమాన్ని మేలవించి చెప్పారు. గతంలో బీజేపీ తరఫున పోటీ చేసిన డాక్టర్ కె.లక్ష్మణ్, అంబర్‌పేట్ నుంచి పోటీ చేసిన కిషన్‌రెడ్డి ఈసారి పోటీ చేయకుండా పారిపోయారని వారికి సినిమా అర్థం అయిందని ఎవరో ఒక బకరాగాళ్లను పెట్టి వారిని బలిపశువులను చేస్తున్నారన్నారు. అసలు వారు పోటీలోనే లేరని చెబుతూ ఇక్కడ బీజేపీ అభ్యర్థి ఎవరు అంటూ ప్రశ్నించడం గమనార్హం. ముఠా గోపాల్ సౌమ్యుడు, మంచివాడని ఆయనను గెలిపించుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు. ఇందిరాపార్కును మరింత అభివృద్ధి చేస్తామని హుస్సేన్‌సాగర్ నాలా మీద అశోక్ నగర్ నుంచి దోమలగూడకు లింక్ బ్రిడ్జీ నిర్మిస్తామని, ఎన్‌టీఆర్ స్టేడియాన్ని మరింత ఆధునీకరిస్తామని, ఇందిరాపార్కులో స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తామని, డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

పోటెత్తిన జనం...

కేటీఆర్ నిర్వహించిన రోడ్ షోకు ప్రజలు పోటెత్తారు. ముషీరాబాద్, రాంనగర్, అడిక్‌మెట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా మహిళలు, యువకులు, మైనార్టీలు తరలివచ్చారు. కేటీఆర్ మాట్లాడుతున్నంత సేపు ఈలలు, చప్పట్లు, కేరింతలు కొట్టారు. ఆయన రాక సందర్భంగా భారీ ఎత్తున బాణాసంచా పేల్చి తమ ఆనందాన్ని చాటుకున్నారు. ముఠా గోపాల్‌తో పాటు ముఠా జైసింహ, ఎమ్మెల్సీ ప్రభాకర్, కన్నాయాదవ్, వి.శ్రీనివాస్‌రెడ్డి, ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన సంగిశెట్టి జగదీష్, నగేష్‌ముదిరాజ్, కార్పొరేటర్ సునీతప్రకాష్‌గౌడ్‌లతో ఆయా డివిజన్‌ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భోలక్‌పూర్ డివిజన్‌లోని సుప్రీం హోటల్ వద్ద జరిగే బహిరంగ సభలో పాల్గొన్నారు.



కేటీఆర్‌ను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం





మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్, హాజరైన జనం





ప్రధాని నరేంద్రమోదీ సోమవారం సాయంత్రం ముషీరాబాద్, అంబర్‌పేట్ నియోజకవర్గాల్లో రోడ్ షో నిర్వహించారు. దారి పొడవునా బీజేపీ కార్యకర్తలు, నాయకులు మోదీ.. మోదీ అని నినాదాలు చేస్తూ ఆయనకు స్వాగతం పలికారు. ప్రధాని వెంట బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఉన్నారు. –ముషీరాబాద్

బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో
చండీ హోమం

ముషీరాబాద్: బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం అడిక్‌మెట్ డివిజన్, బాలాజీనగర్‌లో చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొండపల్లి మాధవ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు సాయిప్రసన్న నేతృత్వంలో అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ, ఎమ్మెల్సీ ప్రభాకర్, కన్నా యాదవ్, శ్రీకాంత్, శైలజ, ప్రేమలత రెడ్డి, జయశ్రీ, అన్నపూర్ణ, స్వర్ణలత, శ్యామ్‌సుందర్ చిట్టి, రామస్వామి, బొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు సాధనకు ఉద్యమం

ముషీరాబాద్: పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టేలా కేంద్రంపై అన్ని రాష్ట్రాల బీసీ ఎంపీలను కలుపుకుని ఒత్తిడి తేనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. విద్యానగర్‌లోని కార్యాలయంలో ఢిల్లీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రీ వేణుమాధవ్‌ను ఆర్.కృష్ణయ్య ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 3న ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయని ఫలితాల అనంతరం జరిగే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. బీసీల కుల గణన, బీసీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాల భర్తీ తదితర డిమాండ్లతో డిసెంబర్ 13,14 తేదీల్లో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్రీ వేణుమాధవ్, మిరియం బాబు, కృష్ణుడు, చిన్నబాబు, దాసరి శ్వేత తదితరులు పాల్గొన్నారు.



కర్రీ వేణుమాధవ్‌ను సత్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

శైవక్షేత్రాల్లో సందడి

నల్లకుంట: సోమవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నల్లకుంటలోని శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. వేకువజామునే భక్తులు ఆదిదంపతుల దర్శనం కోసం ఆలయాల ముందు బారులు తీరారు. పలు ఆలయాల్లో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యూనల్లకుంటలోని శ్రీసీతారాంజనేయ సరస్వతీ ఆలయ ప్రాంగణంలోని శ్రీపర్వత వర్ధిని సహిత రామలింగేశ్వర స్వామికి అభిషేకం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక లింగాలగడ్డ శివాలయం, శంకరమఠంలో శివుడికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు.



న్యూరామాలయంలో.. హారతి ఇస్తున్న అర్చక స్వామి

ఘనంగా లలిత మహాత్రిపుర సుందరి, సుబ్రహ్మణ్య ప్రతిష్ఠాపన మహోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని హనుమాన్ దేవాలయంలో లలిత మహాత్రిపుర సుందరి, సుబ్రహ్మణ్య ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవరత్న న్యాసం, యంత్ర ప్రతిష్ఠ, కురుమ శీల స్థాపన, విగ్రహ స్థాపన, ప్రాణప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటకృష్ణారావు(బబ్లు), శేఖర్, రామకృష్ణ, పురోహితుడు నాగరాజు, ప్రభాకర్, పి.రాజేంద్రప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



చిక్కడపల్లి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. పలువురు జంటలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో దేవనాదం, పద్మ సూర్యప్రకాష్, సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలోనూ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.



మాట్లాడుతున్న డాక్టర్ రోహిణ్ రెడ్డి

తెలంగాణ ప్రజానీకం మార్పు కోరుతోంది

అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్ రెడ్డి

నల్లకుంట: తెలంగాణ ప్రజానీకం మార్పును కోరుతోందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని అంబర్‌పేట నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సి. రోహిణ్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రోహిణ్ రెడ్డి తన తండ్రి డాక్టర్ ముత్యం రెడ్డితో కలిసి సోమవారం నల్లకుంటలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ ఎన్ని చెప్పినా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత సోనియా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఆమె అంకిత భావం, చిత్తశుద్ధి కారణంగానే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనని, కాంగ్రెస్‌ను ఓడించడానికి ఆ రెండు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు. కమీషన్‌ల కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్ నాయకులను ఓటుతో తరిమి కొట్టాలన్నారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి రమేష్, నాయకులు మోత రోహిత్, ఎస్. హరినాథ్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్ రెడ్డి

పదేళ్లుగా నిరుద్యోగులకు అన్యాయం

చిక్కడపల్లి: నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిన పోరాట ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో పదేళ్లుగా నియామకాలు జరగలేదని ఎన్ఎస్‌యుఐ జాతీయ ఇన్‌చార్జ్ కన్నయ్యకుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. సోమవారం ఆయన చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ సమీపంలో విద్యార్థులు, పోటీపరీక్షల అభ్యర్థులు, నిరుద్యోగులతో ముచ్చటించారు. తాను ప్రత్యేకంగా ఎన్నికల ప్రచారం కోసం రాలేదని నిరుద్యోగులు, విద్యార్థులను కలిసేందుకు వచ్చినట్లు తెలిపారు. నిరుద్యోగుల ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. 2024 ఫిబ్రవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, అవకతవకలు లేకుండా పరీక్షలు నిర్వహించేలా ఎన్ఎస్‌యుఐ బాధ్యత వహిస్తుందన్నారు. ఆయన వెంట ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్, వీరేశం, రవి, ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగులతో సమావేశమైన కన్హయ్య కుమార్